క్లుప్తంగా

హామీల అమలులో కూటమిదే బాధ్యత

చీరాల: చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటికి చంద్రబాబుతో పాటు ప్రధాని మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కూ బాధ్యులేనని.. ఉమ్మడి మేనిఫెస్టోతో ఉమ్మడిగా పోటీచేసి అధికారంలోకి వచ్చినప్పుడు ఏమి తెలియనట్లు మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉందని మాజీ ఎంపీ చిమటా సాంబు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన బూటకపు హామీలు ప్రజలు నమ్మి టీడీపీని గెలిపించారన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు చెప్పే మాటలు విని అభద్రతాభావంతో తీవ్ర ఆందోళనలో రాష్ట్ర ప్రజలు ఉన్నారన్నారు. ఎన్నికలల్లో వలంటరీ వ్యవస్థ పట్ల మొసలికన్నీరు కార్చి వలంటరీ వ్యవస్థ కొనసాగిస్తానని, రూ.10 వేలు పారితోషకం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక మౌనంగా ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంతో ఆరోగ్యంగా ఉన్న ఆరోగ్యశ్రీ చంద్రబాబు సీఎం అయ్యాక అనారోగ్యశ్రీగా మార్చారన్నారు. దేశంలో ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.

నేడు 1989-90 బ్యాచ్ స్నేహితుల దినోత్సవం

అద్దంకి: సేవా స్ఫూర్తి కమిటీ 1989-90 బ్యాచ్ పదో తరగతి ఆధ్వర్యంలో నేడు శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో స్నేహితుల దినోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలకు కూలింగ్ ఫ్రిడ్జ్, బధిర పిల్లలకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి పదో తరగతి బ్యాచ్ మిత్రులు అందరూ తప్పకుండా హాజరు కావాలని ఆయన ప్రకటనలో కోరారు.

గోవుల ఆహారం కోసం విరాళం అందజేత



చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్, ఎన్ఆర్ అండ్‌పిఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకింగ్ సభ్యుడు వేమా బ్రహ్మానందం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైస్కూలు క్రీడామైదానంలో గోవుల ఆహారం నిమిత్తం శ్రీకృష్ణ గోశాల నిర్వాహకులు దేవకి సుబ్బారావుకు రూ. 11,116 అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, కార్యదర్శి చారుగుళ్ల గురుప్రసాద్, చింతా రమేష్, అమరా వీరాంజనేయులు, పి. వెంకట రమణారావు, డి. తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

చీరాల రూరల్: కొత్తపేటలోని చిన్నపాటి గుడిసెలలో నివాసముంటూ ఇళ్లల్లో పాచిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 20 యానాది సామాజిక కుటుంబాలకు పద్మభాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో నిత్యవసరాలైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి పద్మజ్యోత్స్న, ఎడ్ల ప్రసాద్, వనమా జయకుమార్, పేరాల జనార్దన్, బుర్ల రామకృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు టీడీపీ పాలకవర్గంలో కీచులాటలు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు గ్రామ పంచాయతీ టీడీపీ పాలకవర్గంలో కీచులాటలు తారాస్థాయికి చేరుతున్నాయి. గత కొన్ని రోజులుగా గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి, వార్డు సభ్యురాలు పాతూరి ఆదిలక్ష్మి వర్గాల మధ్యన ఆదిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో పారిశుద్ధ్య కార్మికుల టెండర్ల విషయంలో అవకతవకలు జరిగాయంటూ శుక్రవారం సర్పంచ్ వర్గం సభ్యులు, కొంత మంది గ్రామస్తులు, తీసివేసిన పారిశుద్ధ్య కార్మికులతో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేశారు. శనివారం మళ్లీ ఇరు వర్గాల మధ్యన కారంచేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వాదనలు జరిగాయి. ఒకరికొకరు నిందలతో ఒకరిపైకొకరు పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టుకొనే వరకు వచ్చారు. ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. ఈపంచాయతీ ఎక్కడికి వెళ్లి ఆగుతుందో అని గ్రామస్తులు, పాలకవర్గ సభ్యులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కందులకు డాక్టరేట్ ప్రదానం



మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన కందుల రత్నం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గ్రామీణాభివృద్ధి పరిశోధనలో భాగంగా పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు రత్నం తెలిపారు. ఇంపాక్ట్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఆన్ లివింగ్ కండీషన్స్ ఆఫ్ అగ్రికల్చర్ లేబర్– ఏ కేస్ స్టడీ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేశానని ఆయన తెలిపారు. డాక్టరేట్ పొందిన కందుల రత్నానికి పలువురు అభినందనలు తెలిపారు.

గిరిజనులు అన్ని రంగాల్లో ఎదగాలి

- న్యాయసేవ అధికార సంస్థ, రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరాల ఏర్పాటు
- శిబిరాల్లో పాల్గొన్న సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు



వేటపాలెంలో మాట్లాడుతున్న చీరాల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సుధా

వేటపాలెం: గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని చీరాల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా పేర్కొన్నారు. రామన్నపేట పంచాయతీ వినాయక పురం (ఎస్టీ ఏరియా)లో చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు గిరిజనుల ఏరియాలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. ఆమేరకు ఎక్కువగా గిరిజనులు నివసించే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నామని చెప్పారు. పూర్వం గిరిజనులు అటవీ ప్రాంతంలో ఎక్కువగా ఉండేవారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం వారందరూ సమాజంలోకి వచ్చారన్నారు. అయితే వారిలో ఉన్న నిరాక్షరాస్యత వల్ల చట్టాలపై వారికి అవగాహన లేకుండా పోయిందన్నారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే రెహానా, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌డీ నిషా ద్‌నాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్టీలకు అనేకమైన పథకాలు అమలు చేస్తున్నప్పటికీ వారిలో మార్పు రాలేదన్నారు. పిల్లలను పనుల్లో పెట్టడం, బాల్యవివాహాలు చేయడం, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని వాటికి దూరం చేసేవిధంగా చైతన్య పరచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల వారిలో మానసిక ఆందోళన పెరుగుతుందన్నారు. పారా వలంటీర్లను ఏర్పాటు చేసి గిరిజనులను అన్ని విధాలుగా చైతన్యపరచాలన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని అందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీ రమేష్‌బాబు, డీఎంహెచ్‌ఓ విజయమ్మ పాల్గొన్నారు.

వైద్య సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

అద్దంకి: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జే సీత అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయసేవా అధికార సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సౌజన్యంతో అద్దంకి శ్రీరామ్‌నగర్ కాలనీలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి హాజరయ్యారు. గాజులపాలెం అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ, సిబ్బంది గర్భిణులు, బాలింతలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి సీత మాట్లాడుతూ గిరిజనులు అందరూ ఆర్థికంగా ఎదగడంతోపాటు, విద్యాపరంగా అన్ని రంగాల్లో ఉండాలని ఆకాంక్షించారు. వివిధ చట్టాలు, గిరిజన హక్కుల గురించి తెలియజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం గిరిజన ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. తరువాత న్యాయవాదులు కే మార్త శ్రీనివాస్, ఎం ప్రకాష్ గృహలక్ష్మి, అనూష, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎం రమేష్ షేక్ మహ్మద్ రఫీ వివిధ చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చుండూరు మురళి సుధాకర్, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, అలహరి హరిబాబు, పీ ఆంజనేయులు, కార్యక్రమానికి సహకరించిన దాత పోస్టల్ ఏజెంట్ చిన్ని కామేశ్వర రావు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం..

చినగంజాం (పర్చూరు): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక ఇందిరా కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ఆమె కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆమె సూచించారు. అనారోగ్యం బారిన పడిన వెంటనే సమీపంలో ఉన్న హాస్పిటల్ వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కాలనీ వాసులకు చెప్పారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమణి, కరి ప్రవీణ్, వైద్యులు గౌతమ్, ఏకాంబరేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి



అద్దంకి శ్రీరామ్‌నగర్ రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అంజిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



వైఎస్సార్, అంజిరెడ్డి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి



అంజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శచీదేవి, చినహనిమిరెడ్డి

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు భీమనాథం అంజిరెడ్డి పార్టీకి తీరని లోటని అద్దంకి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన భీమనాథం అంజిరెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఆయన హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమానికి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచిదేవి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, భీమనాథం అంజిరెడ్డి విగ్రహాలను పానెం చిన హనిమిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అంజిరెడ్డి భార్య సీతాదేవి, కుమారుడు సుబ్బారెడ్డి, కూతురు పద్మతో మాట్లాడారు. అంజిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుదన్నారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు పులికం కోటిరెడ్డి, జే రవిబాబు, రెడ్డి సంఘం జిల్లా అధికారి ప్రతినిధి శంకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం నాయకుడు రామాంజినేయులు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చక్రవరం భాస్కర్‌రాజు, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు మూరబోయిన ఆంజనేయులు, ప్రచార కమిటీ అధ్యక్షుడు లోకిరెడ్డి లక్ష్మారెడ్డి, జంపాని రాజు, ఆనందరావు అన్ని గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



ఉచితంగా పశువుల ఔషధాలు అందిస్తున్న ప్రొఫెసర్లు

చీరాల టౌన్: పాడిపరిశ్రమ, పశువులు, జీవాలపై పశుపోషకులు తగిన జాగ్రత్తలను తీసుకుని సీజనల్ వ్యాధుల బారినపడకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ విజయ్ ప్రకాష్ సూచించారు. శనివారం మండలంలోని వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన కావూరి వారిపాలెం గ్రామంలో వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పశువులు, దూడలు, గేదెలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు అందించారు. అలానే ప్రతి పశుపోషకుడికి ఉచితంగా దాణా, పలురకాల ఔషధాలు అందించారు. అనంతరం ప్రొఫెసర్లు అచ్యుతరాజ్, సుశీల మాట్లాడుతూ పాడిపరిశ్రమ రైతులకు రెండో కన్నువంటిదని, పశువులు, గేదెలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతు ప్రతినిధులు కావూరి రమణారెడ్డి, మంచాల తారక్, ఏడుకొండలురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అంకమ్మరావు, చిన్నపిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్య భాగ్యం



మొక్కలు నాటుతున్న ఎంఈవో సుధాకర్

అద్దంకి: పచ్చని ఔషధ మొక్కలతో ఆరోగ్య భాగ్యం కలుగుతుందని ఎంఈవో బీ సుధాకర్ అన్నారు. ఆసంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఔషధ మొక్కల బోర్డు, ఆయుష్ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి ఆర్థిక సౌజన్యంతో పాఠశాలల్లో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దానిలో భాగంగా శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమానికి ఎంఈవో బి.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉరుకులు పరుగుల జీవితం క్షణం తీరికలేని వ్యవహారాలు వెరసి మనిషి జీవిత మూలాలను మరచిపోతున్నాడన్నారు. ఉన్నతమైన జీవితాన్ని అందుకునే గమనంలో ప్రకృతి అందించిన ఔషధ మొక్కలను అందరూ నాటి పెంచాలన్నారు. శింగరకొండలోని గురుకుల పాఠశాల, ధర్మవరం రెడ్డిపాలెం, కలవకూరు, గ్రామాల పాఠశాలల ఆవరణల్లో, వేప, తులసి, అలోవెరా, అశ్వగంధ, బ్రహ్మ ఉసిరి, తమలపాకు, ఎర్రచందనం, రణపాల, నల్ల పసుపు, పుదీనా మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో సీఆర్ ఎంటీలు, టి. శంకర్, ఎం.రమేష్, బి. వికాస్, బి. రాంబాబు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

వయనాడు బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అద్దంకి: మానవతా విలువలతో కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల ప్రజల కోసం ప్రజలు విరాళాలు అందించాలని జిల్లా సీపీఎం పార్టీ కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వయనాడు బాధిత ప్రజల కోసం శనివారం అద్దంకి పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో మితిమీరిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడి గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయాయని, ఆయా గ్రామాల బాధిత ప్రజల కోసం మన వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, కె. రఘుచంద్ , బి విజయ్ కుమార్, పొనకా రామాంజనేయులు, సింగర కొండపాలెం గ్రామానికి చెందిన కే ప్రమీల, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్లు (1) బెల్లంకొండ పూర్ణచంద్రరావు S/o గుర్నాథమ్, (2) బెల్లంకొండ పద్మజ W/o పూర్ణ చంద్రరావు, సంపత్‌నగర్ కాలని, కొత్తపేట, వేటపాలెం మండలం, బాపట్ల జిల్లా అనువారి నుండి సంజాయిషీ పొంది యిందు వెంట యావన్మందికి తెలియ జేయునది ఏమనగా..

మా క్లయింట్లు కుమారుడు అయిన బెల్లంకొండ నవీన్‌కుమార్ దురలవాట్లకు లోనై మా క్లయింటు కుటుంబముతో ఎటువంటి సంబంధములు లేకుండా జీవనం చేయుచు అప్పులు చేయుచు, హెచ్చు మొత్తములకు ఖాళీ ప్రాంశరీ నోట్లు ఖాళీ చెక్కులు పై సంతకములు చేయుచు, యిష్టము వచ్చినట్లు ప్రవర్తించుచున్నట్లు మా క్లయింట్లకు తెలియ వచ్చినది. అతను భార్య స్వప్న పేరుతో కూడా ఖాళీ ప్రాంశరీ నోట్లు చెక్కులు కూడ యిచ్చినట్లు మా క్లయింట్లుకు తెలియవచ్చియున్నది. సదరు లావాదేవీలు చట్టము ప్రకారము చెల్లవు. అతనికి ఎవరు అప్పులు ఇవ్వవద్దని, మా క్లయింట్లు కు ఎటువంటి సంబంధము లేదని యిందు వెంట పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

యం.వి. చలపతిరావు, అడ్వకేట్,
పాపరాజుతోట, చీరాల సెల్ :9985854833

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



హరిప్రసాద్‌నగర్‌లో తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీడీపీఓ సుచిత్ర



దగ్గుబాడులో తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

బల్లికురవ: తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్ అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నుపల్లిలో తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ తల్లిపాలతో తల్లీబిడ్డ మధ్య అనుబంధం పెరగటంతో పాటు శారీరక మానసిక ఎదుగుదలకు అవసరమయ్యే పోషకాలు ఉంటాయన్నారు. ఈ సదస్సులో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశలు వర్కర్లు పాల్గొన్నారు.

దగ్గుబాడు (కారంచేడు): సృష్టిలో ఏ బిడ్డకైనా వారి తల్లిపాలే మొదటి ఆహారంగాను, అమృతంగాను ఉంటుందని ఐసీడీఎస్ స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. శనివారం ఆమె మండలంలోని దగ్గుబాడు–4వ సెంటర్‌లో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల్లో తల్లులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, పీ మాధురి, షేక్ హఫీజా, సరోజినీ, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష..

చీరాల /చీరాల టౌన్/చీరాల అర్బన్: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి బిడ్డకు రెండేళ్లపాటు తల్లిపాలను ఇవ్వడం వలన బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉంటారని తోటవారిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ పి.వి జయలక్ష్మీ అన్నారు. శనివారం మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో ఐసీడీఎస్ సెక్టార్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీరాలలోని ఆనందపేట అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ గ్లోరీ తబిత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

- తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏసీడీపీఓ ఎం.సుచిత్ర అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వేటపాలెం ప్రాజెక్టు పరిధిలోని చీరాల పట్టణంలోని బీ–సెక్టారు హరిప్రసాద్ నగర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు 3-6 సంవత్సరాల పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.కుముద్వతి, కౌన్సిలర్ బి.శిరీష, ఏఎన్ఎం ఎం.రమాదేవి, మహిళా పోలీసు కె.దేవచంద్రిక, ఎస్.సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉషారాణి, మహాలక్ష్మి, ఆషా వర్కర్ ఎం.తులసి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తోటవారిపాలెంలో సదస్సులో సూచనలందిస్తున్న సూపర్‌వైజర్



చెన్నుపల్లిలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న వైద్యాధికారి

రేపు రైతుల కోసం విద్యుత్ అదాలత్

బల్లికురవ: నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకొన్న రైతులకు ఈ నెల 5వ తేదీన విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు మార్టూరు సబ్ డివిజన్ విద్యుత్ అధికారి ఎం సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బల్లికురవలోని విద్యుత్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఈఅదాలత్‌కు అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నల్లూరి మస్తాన్‌రావు ముఖ్య అతిథిగా హాజరౌతున్నట్లు చెప్పారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలలో నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు పెట్టిన వారు, డీడీలు కట్టినవారు తమ సమస్యలను తెలిపితే, నిబంధనలను అనుసరించి పరిష్కరిస్తారన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

రెండో విడతలో విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు



పిల్లిమెట్ల వెన్నెల



ఎస్ హేమలత

అద్దంకి: మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. సంధిరెడ్డి హేమలత ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, పిల్లిమెట్ల వెన్నెల ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని పాఠశాల హెచ్‌ఎం పెంట్యాల గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వాహనం ఢీకొని ఐదు గొర్రెలు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

మార్టూరు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఐదు గొర్రెలు మృతి చెందాయి. ఈఘటన శనివారం సాయంత్రం రాజుపాలెం సమీపంలో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌గర్ జిల్లా బొక్కలోనిపల్లె గ్రామానికి చెందిన పూసలపాడు రాజేష్ తన గొర్రెల మందను తోలుకొని చిలకలూరిపేట నుంచి ఒంగోలు వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. స్థానిక రాజుపాలెం జంక్షన్ సమీపంలో ఎలవర్తి కోల్డ్ స్టోరేజ్ ఎదురు రోడ్డు దాటుతున్న గొర్రెల మందను ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని కారు అతివేగంగా గొర్రెల మందను ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాద ధాటికి గొర్రెలు రహదారి పక్కన చెల్లాచెదురుగా విడిపోగా మూడు పెద్దవి రెండు చిన్న గొర్రెలు మొత్తం ఐదు అక్కడికక్కడే మృతి చెందగా మరికొన్నింటికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది ప్రమాద స్థలికి చేరుకొని ట్రాఫిక్ అవరోధాలు తలెత్తకుండా పరిస్థితి చక్కదిద్దారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీకై ప్రయత్నిస్తున్నారు.

బాల కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తే చర్యలు



బాల కార్మికులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

చీరాల రూరల్: బాల కార్మికులను పనులలో పెట్టుకుని వారితో వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల లేబర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. షాడోస్ స్వచ్ఛంద సంస్థ, కార్మికశాఖ కార్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో బాల కార్మికుల కోసం శనివారం పట్టణంలోని బట్టల షాపులు, దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బాల కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. చిన్న పిల్లలను బలవంతంగా పనులలో పెట్టుకుని వారితో వెట్టిచాకిరి చేయించవద్దని, చట్ట రీత్యా నేరమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, షాడోస్ ప్రతినిధి న్యాయవాది రాజా సాల్మన్, ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ప్రియ, రాము, కిషోర్, షాడోస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణం జరుగుతోంది. దాని నిర్మాణం కోసం తన వంతు సాయంగా శనివారం ఇనిమెళ్ల గ్రామస్తులు నరసారెడ్డి, కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మాధవరెడ్డి, మల్లికార్జునరెడ్డి శనివారం రూ.1 లక్ష విరాళంగా ఈవోకు అందజేశారు.